


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
30-05-2025
పేజీలు: 02

## ఐపీఎల్‌లో నేడు



గుజరాత్ VS ముంబై
ములాన్‌పూర్,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్‌స్టార్‌లో..

## ఐపీఎల్ ప్లే ఆఫ్స్

బెంగళూరు
క్వాలిఫైయర్ 1, మే 29
న్యూ ఛండీఘర్
పంజాబ్




నో రిజల్ట్
క్వాలీఫైయర్ 2, జూన్ 01
అహ్మదాబాద్
పంజాబ్

ఆర్సీబీ
ఫైనల్, జూన్ 03
అహ్మదాబాద్
నో రిజల్ట్

గుజరాత్
ఎలిమినేటర్, మే 30
న్యూ ఛండీఘర్
ముంబై



ఆరెంజ్ క్యాప్
679
ఐపీఎల్
అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్
24
ఐపీఎల్
అత్యధిక వికెట్స్


# భైరవం రివ్యూ



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటించిన సినిమా భైరవం. చాలా రోజులుగా ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. విజయ్ కనకమేడల తెరకెక్కించిన ఈ చిత్రం తాజాగా విడుదలైంది. పెన్ స్టూడియోస్ బ్యానర్‌పై డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. మరి ఈ సినిమా ఎలా ఉందో పూర్తి రివ్యూలో చూద్దాం.. తూర్పు గోదావరి జిల్లా దేవీపురం గ్రామంలో వారాహి అమ్మవారు చాలా పవర్ ఫుల్. ఆ గుడిని చూసుకునే బాధ్యత నాగరత్నమ్మపై ఉంటుంది. ఆమె తన మనవడు వరద (నారా రోహిత్)తో పాటు గజపతి (మనోజ్ మంచు), శ్రీను (బెల్లంకొండ శ్రీనివాస్)లను కూడా తన మనవళ్ల లాగే పెంచుతుంది. నాగరత్నమ్మ చనిపోయిన తర్వాత గుడిని దక్కించుకోవాలని చూస్తారు నాగరాజు (అజయ్). అయితే నాగరాజు ఎత్తుకు పై ఎత్తులు వేసి శ్రీనును ట్రస్టీ చేస్తారు గజపతి, వరద. ఓసారి గజపతి చిక్కుల్లో పడతాడు.. అలాంటి సమయంలో ఆయన ప్రాణాలు కాపాడతాడు నాగరాజు, గజపతి బావమరిది పులి (సందీప్ రాజ్). అదే టైమ్‌లో ప్రాణంగా భావించే వరదనే గజపతి చంపాల్సిన అవసరం వస్తుంది. కానీ ఆ నేరం శ్రీను తనపై వేసుకుని పోలీసులకు లొంగిపోవడమే కాకుండా.. వరద భార్య ముందు చెడ్డవాడిగా మారిపోతాడు. ఆ తర్వాత ఏమైంది..? ఎందుకు శ్రీను అలా చేసాడు..? అసలు వరదకు ఏమైంది అనేది మిగిలిన కథ.. భైరవం అనేది స్ట్రెయిట్ సినిమా కాదు.. ఇది రీమేక్ సినిమా. గరుడన్ సినిమాను తీసుకుని తెలుగు ఆడియన్స్‌కు తగ్గట్లు కథలో చిన్న చిన్న మార్పులు చేసాడు దర్శకుడు విజయ్ కనకమేడల. పెద్దగా మార్పులు చేర్పులైతే చేయలేదు.. ఉన్నదున్నట్లు తీసే ప్రయత్నమే ఎక్కువగా చేసాడు. కాకపోతే తెలుగులో ఇంకాస్త కమర్షియల్‌గా తీసే ప్రయత్నమైతే చేసాడు. అందులో భాగంగానే ఫస్టాఫ్ చాలా వరకు స్లో అయిపోయింది. ముఖ్యంగా ఫోర్స్‌గా వచ్చే సీన్స్ ఉంటాయి. తొలి 40 నిమిషాల వరకు సినిమా నెమ్మదిగానే వెళ్తుంది. కథలో మెయిన్ ట్రాక్ మొదలైన తర్వాత వేగం పెరుగుతుంది. ఫస్ట్ సీన్ నుంచే ముగ్గురు హీరోల మధ్య బాండింగ్ బాగా చూపించాడు దర్శకుడు విజయ్ కనకమేడల. ఆ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ముగ్గురి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. అలాగే బెల్లంకొండ, అదితి శంకర్ ట్రాక్ కూడా పర్లేదనిపిస్తుంది. ఫస్టాఫ్ ఎక్కువగా ఎలివేషన్స్ కోసం టైమ్ తీసుకున్నాడు విజయ్. నారా రోహిత్, బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్.. ఇలా ఒక్కొక్కరికీ సపరేట్‌గా ఎంట్రీస్ ప్లాన్ చేసాడు. పోలీస్ ఆఫీసర్‌తో నెరేషన్ ఇప్పించడం బాగుంది. అసలు కథ మొత్తం సెకండాఫ్‌లోనే ఉంది. ప్రీ ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోయింది. ప్రాణానికి ప్రాణంగా ఉన్న స్నేహితులే చంపుకునే వరకు ఎందుకొచ్చారు అనేది ఈ సినిమాలో మెయిన్ ట్విస్ట్. అది థియేటర్లో చూస్తేనే బాగుంటుంది. ముగ్గురి మధ్య వైరం మొదలైన తర్వాత ఆసక్తికరంగా మారింది కథనం. నెక్స్ట్ ఏం జరుగుతుందబ్బా అని ఆసక్తిగా వేచి చూసేంత స్క్రీన్ ప్లే అయితే లేదులే గానీ.. ఓకే అనిపిస్తుంది. కథ ముందుగానే అర్థమవుతున్నా.. చూడ్డానికి ఆసక్తికరంగానే ఉంటుంది. సెకండాఫ్ వరకు బాగానే మ్యానేజ్ చేసాడు దర్శకుడు విజయ్ కనకమేడల. క్లైమాక్స్ కూడా ఈ సినిమాకు బలం. అక్కడ మంచు మనోజ్, బెల్లంకొండ ఇద్దరూ రప్ఫాడించారు. కానీ వీళ్ళిద్దరి కంటే సైలెంట్‌గా నారా రోహిత్ క్యారెక్టర్ బాగా పండింది. తమిళంలో సూరి పాత్ర అండర్ డాగ్‌గా ఉంటుంది.. కానీ తెలుగు కోసం బెల్లంకొండ పాత్రను మరింత పవర్ ఫుల్‌గా మార్చేసారు.. దానికితోడు మిగిలిన రెండు క్యారెక్టర్స్ కూడా సామాజిక న్యాయం చేయడానికి చూసాడు విజయ్ కనకమేడల. అందులోనే కాస్త బ్యాలెన్స్ తప్పింది కథ. క్లైమాక్స్‌తో మళ్లీ గాడిన పడింది సినిమా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు ఈ సినిమా బాగానే ప్లస్ అవుతుంది. శ్రీను పాత్రలో బాగా నటించాడీయన. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే పూనకాలు సీన్ అదిరిపోయింది. మంచు మనోజ్ కోరుకున్న కమ్ బ్యాక్ ఇది. అదిరిపోయే యాక్షన్‌తో రప్ఫాడించాడు మంచు వారబ్బాయి. నారా రోహిత్ సైలెంట్ కిల్లర్.. మనోడు చాలా సెటిల్డ్‌గా మాయ చేసాడు. హీరోయిన్లు అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై పాత్రలు కథకు తగ్గట్లుగా ఉన్నాయి. మరోవైపు వెన్నెల కిషోర్ కాసేపు పర్లేదు. జయసుధ ఉన్నంత సేపు బాగా నటించారు. అజయ్, సందీప్ రాజ్ లాంటి వాళ్లు తమ పాత్రలకు న్యాయం చేసారు. శ్రీ చరణ్ పాకాలా సంగీతం పర్లేదు. పాటల కంటే ఎక్కువగా బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది. సినిమాటోగ్రఫీ బాగానే ఉంది. ఎడిటింగ్ బాగా వీక్.. ముఖ్యంగా ఫస్టాఫ్ అయితే చాలా వరకు సీన్స్ అదనంగా వచ్చాయేమో అనిపించింది.

## యూఎస్ కోర్టు ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు

ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై విధించిన టారిఫ్‌లను ఆ దేశ ఫెడరల్ కోర్టు అడ్డుకున్నది. ప్రతి దేశంపైనా విస్తృత సుంకాలను విధించే అధికారం ట్రంప్‌కు లేదని ఫెడరల్ కోర్టు గురువారం తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. అయితే, సుంకాల విధింపు విషయంలో తాజాగా మరో యూఎస్ కోర్టు ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది.ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ సర్కార్ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేసింది. దీనిపై జూన్ 5లోగా ఫిర్యాదుదారులు, జూన్ 9లోగా పరిపాలనాధికారులు స్పందించాలని ఆదేశించింది. రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలు విధించారు . అయితే, ఈ సుంకాల విషయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది.



## యూట్యూబర్ సన్నీ యాదవ్ అరెస్ట్

తెలుగు వ్లాగర్/యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. మోటార్ సైకిల్‌పై దేశవిదేశాల్లో పర్యటిస్తూ.. వ్లాగింగ్(అక్కడి పరిస్థితులను వివరించే వీడియోలు చేయడం) చేసే సన్నీ.. ఇటీవల పాకిస్థాన్‌ను సందర్శించారు. దీంతో.. పాక్ సందర్శనకు గల కారణాలపై విచారణ జరిపేందుకు ఎన్ఐఏ అధికారులు అతణ్ని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన నేపథ్యంలో ఉద్రిక్తతలు ఉన్నా.. సన్నీ పాకిస్థాన్‌కు వెళ్లడం వివాదాస్పదమైంది. భారత రహస్యాలను పాక్‌కు చేరవేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరో 11 మంది అరెస్టు తర్వాత.. ఈ తరహా వ్లాగర్లపై ఎన్ఐఏ నిఘా పెంచింది. ఈ క్రమంలో సన్నీతోపాటు.. మరో ముగ్గురు వ్లాగర్ల కదలికలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. సన్నీ యాదవ్ అసలు పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లాడు? ఉద్రిక్తతల తరుణంలో శత్రుదేశాన్ని సందర్శించడానికి కారణమేంటి? అనే కోణంలో అతణ్ని విచారించనున్నట్లు సమాచారం. కాగా.. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం కల్పించిన కేసులోనూ సన్నీ నిందితుడిగా ఉన్నారు. పంజాగుట్ట కేసులో అతనికి నోటీసులు అందగా.. సూర్యాపేట పోలీసులు కూడా కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన సన్నీ.. తనపై బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసు నమోదయ్యాక హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. అది కుదరకపోవడంతో దుబాయ్ వెళ్లారు. దాంతో లుకౌట్ నోటీసు జారీ అయ్యింది. సన్నీ దుబాయ్ నుంచి పాకిస్థాన్ వెళ్లినట్లు సమాచారం. భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన సమయంలోనూ అతను పాక్‌లోనే ఉన్నట్లు ఎన్ఐఏ వర్గాలు అనుమానిస్తున్నాయి. గతంలో కూడా అతను ఐదు సార్లు పాకిస్థాన్‌కు బైక్‌పై వెళ్లినట్లు తెలిసింది. సన్నీ తన పాకిస్థాన్ ట్రిప్‌పైనా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. అతని కుటుంబ సభ్యులు మాత్రం అరెస్టు వార్త తమకు




తెలియదని, సన్నీ నిత్యం బైక్ యాత్రలు చేస్తుంటాడని తెలిపారు. టీవీల్లో చూశాకే తమకు సమాచారం తెలిసిందని చెప్పారు. కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ వేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. సన్నీ పుట్టి పెరిగిందంతా సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం శిల్పకుంట్ల గ్రామంలో. తండ్రి ఓ ఫార్మసీ స్టోర్‌ను నడుపుతున్నారు. తల్లి గృహిణి. సన్నీ సోదరుడు కల్యాణ్ కబడ్డీ ఆటగాడు. మధ్యతరగతి నుంచి వచ్చిన సన్నీ.. చదువుల్లో ఫర్వాలేదని పించి, మోటార్ సైక్లింగ్‌లో దూసుకువెళ్లేవారు. 13 ఏళ్ల వయసు నుంచే వాహనాన్ని నడపడం నేర్చుకున్న సన్నీ.. 18వ ఏట డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని, యమహాపై రయ్‌మంటూ ట్రిప్పులు వేసేవారు. 2016లో వ్లాగింగ్ మీద ఆసక్తి పెంచుకుని, ప్రయత్నాలను మొదలుపెట్టారు. మొదట్లో 100-150 కిలోమీటర్ల దూరాలతో ప్రయత్నించారు. యూట్యూబ్ వీక్షణలు పెద్దగా లేకపోవడంతో.. 2018 నుంచి పెద్ద ట్రిప్‌లను ప్లాన్ చేసేవారు.



## డిసెంట్ లుక్‌లో త్రిష

హీరోల మాదిరిగానే హీరోయిన్లు కూడా సినీ రంగంలో ఎక్కువ కాలం నిలబడగలరా అనే చర్చ వచ్చినప్పుడల్లా, త్రిష, నయనతారలాంటి హీరోయిన్లను ఉదాహరణగా చూపించవచ్చు. దాదాపు 25 సంవత్సరాలుగా ఫిల్మ్ ఇండస్ట్రీలో స్టార్ గా కొనసాగుతున్న కోలీవుడ్ క్వీన్ త్రిష. ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమాల్లోకి అడుగుపెట్టను అని కాలేజీ రోజుల్లో చెప్పిన త్రిష, నేడు సౌత్ ఇండియాన్ సినిమాకు స్పెషల్ ఐకాన్ గా నలిచింది. ఒక జ్యువెల్లరీ యాడ్ వల్ల త్రిషకు తొలి సినిమా అవకాశం వచ్చిందంటే నమ్మగలరా... అదే నిజం. ఆ ప్రకటనలో త్రిష స్నేహితురాలిగా సమంత నటించడం మరో విశేషం. సినిమాల్లో నటించనని చెబుతూ వచ్చిన త్రిష, జోడీ సినిమాలో నటి సిమ్రన్ స్నేహితురాలిగా తొలిసారిగా తెరపై కనిపించారు.ఆ తర్వాత తమిళ సినీ రంగం త్రిషను ఆకర్షించింది. తర్వాత లేసా లేసా చిత్రంలో కథానాయికగా నటించేందుకు ఒప్పందం కుదిరింది. అయితే ఆ చిత్రం కంటే ముందే మౌనం పెసినది విడుదల కావడంతో, అదే ఆమె తొలి చిత్రంగా మారింది.

## మోదీ జీ.. ఎవరి సత్తా ఏంటో ఎన్నికల్లో చూస్కుందాం



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, తమ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలకు ఘాటుగా బదులిచ్చారు. మోదీకి బహిరంగ సవాల్ విసురుతూ, ధైర్యం ఉంటే తనతో లైవ్ డిబేట్‌కు రావాలని, ఎన్నికలు రేప్పొద్దునే వచ్చినా తమ పార్టీ సిద్ధమేనని ధీమా వ్యక్తం చేశారు.నాతో లైవ్ డిబేట్‌లో కూర్చోవాలని సవాల్ విసురుతున్నా. కావాలంటే మీ టెలీప్రాంప్టర్ కూడా తెచ్చుకోవచ్చు అంటూ మమత మోదీని వెటకారమాడారు. ఇది మోదీ ప్రసంగాల్లో టెలీప్రాంప్టర్ వాడకంపై ఉన్న విమర్శలను ఉద్దేశించినట్లు స్పష్టమవుతోంది.బీజేపీ నేతలు "ఆపరేషన్ బెంగాల్" ప్రారంభించాలని చేసిన వ్యాఖ్యలపై మమత తీవ్రంగా మండిపడ్డారు. విపక్ష నేతలు అంతర్జాతీయంగా దేశం కోసం పాటుపడుతుంటే, స్వదేశంలో కేంద్రం మాత్రం రాజకీయాలు చేస్తోందని ఆమె దుయ్యబట్టారు. ప్రధాని మాటలు విని విస్తుపోయా. ఇది చాలా బాధాకరం. విపక్షాలన్నీ కలిసి అంతర్జాతీయ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దేశం కోసం ధైర్యంగా ముందడుగేశాయి.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# కొత్తగా పెళ్లైన జంట హనీమూన్‌కు వెళ్లి అదృశ్యమైంది

మేఘాలయలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. కొత్తగా పెళ్లైన జంట హనీమూన్‌కు వెళ్లి అదృశ్యమైంది. వారం గడిచినా ఇంకా వారి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఆ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు, ఇతర శాఖల అధికారులు, స్థానికులు ఆ జంట కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా వెల్లడించారు. అలాగే ఈ కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కి చెందిన ట్రాన్స్‌పోర్టు వ్యాపారి రాజా రఘువంశీ-సోనమ్‌లకు కొత్తగా పెళ్లైంది. ఈ జంట హనీమూన్ కోసం మే 20న మేఘాలయ వెళ్లారు. చివరిసారిగా సోహ్రా లో పర్యటించిన వాళ్లు ఆ తర్వాత కనిపించకుండా పోయారు. అయితే, స్థానికంగా ఓ బైక్‌ను అద్దెకు తీసుకుని కొండప్రాంతం వైపు వెళ్లినట్లు సమాచారం. అనంతరం ఓ ప్రాంతంలో బైక్‌ను వదిలేసి కాలినడకన వెళ్లినట్లు తెలుస్తోంది. ఇక, ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న మేఘాలయ ప్రభుత్వం ముమ్మర గాలింపు చేపట్టింది. మరోవైపు వారి కుటుంబ సభ్యులు కూడా దంపతుల ఆచూకీ చెప్పిన వారికి రూ. 5లక్షల రివార్డును ప్రకటించింది. ఈ ఘటన నేపథ్యంలో సీఎం సంగ్మా మాట్లాడుతూ "మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నూతన దంపతులకు సంబంధించి దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. వాళ్లు అదృశ్యమైనట్లు మాకు సమాచారం అందింది. ఎంపీ సీఎం మోహన్ యాదవ్ కూడా నాతో మాట్లాడారు. ఆ రాష్ట్ర హోంశాఖ నుంచి కాల్స్ వచ్చాయి. ఆ జంట ఆచూకీ కోసం పోలీసులు, అధికారులే కాకుండా స్థానికులు కూడా ముమ్మరంగా గాలిస్తున్నారు. దీనిపై రోజు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నా" అని ముఖ్యంత్రి ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. కాగా, వర్షాలు పడుతుండటంతో సెర్చ్ ఆపరేషన్‌కు ఆటంకం కలుగుతుందని సీఎం తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని, చిరపుంజిలో భారీ వర్షాలు పడుతుండడంతో గాలింపునకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.



## ఇంకా 28 రోజులే.. 'కన్నప్ప'పై మంచు విష్ణు స్పెషల్ పోస్ట్

టాలీవుడ్ డైనమిక్ స్టార్ మంచు విష్ణు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న చిత్రం 'కన్నప్ప' ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తోంది. ఇదివరకే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లు, పాటలు సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. తాజాగా, మేకర్స్ ఈ చిత్రం నుంచి కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో శివుడి పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ అద్భుతమైన లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. "జూన్ 27న 'కన్నప్ప' మీ ముందుకు వస్తోంది. ఇంకా కేవలం 28 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి" అంటూ మంచు విష్ణు ఈ పోస్టర్‌ను తన 'ఎక్స్' ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. కన్నప్ప ప్రేక్షకుల ముందుకు రావడానికి ఇంకా 28 రోజులు మాత్రమే మిగిలిఉంది. నేడు చెన్నై వీధుల్లో కన్నప్ప గర్జించనున్నాడు. తమిళ మీడియా ముందు ఇప్పటివరకు చూడని అన్‌సీన్ ఫుటేజ్‌ని ప్రదర్శించనున్నాం. భక్తి, యాక్షన్, మీ హృదయాన్ని కదిలించే కథతో జూన్ 27న రానున్నాం అంటూ విష్ణు రాసుకొచ్చాడు.

## తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్రమంత్రి సీరియస్ వార్నింగ్..!



తెలంగాణలోని పార్టీ నేతల తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలతో పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఇటువంటి ధోరణులను సహించేది లేదని, గీత దాటితే కఠిన చర్యలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు. పార్టీ కార్యాలయాన్ని కొందరు తమ వ్యక్తిగత అవసరాలకు, ప్రచారాలకు వాడుకుంటున్నారని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ఆఫీసులో కేవలం పార్టీ విధానాలకు అనుగుణంగానే మాట్లాడాలని, పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎవరూ ప్రవర్తించకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా, నేతలు ఇష్టానుసారంగా ప్రెస్ మీట్లు నిర్వహించి, వ్యక్తిగత దూషణలకు దిగడంపై కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకమీదట పార్టీ నాయకులు ఎవరైనా ప్రెస్ మీట్ పెట్టాలంటే కచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ నిబంధన తనతో సహా పార్టీలోని ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నాయకులు హుందాగా ప్రవర్తించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. భారతీయ జనతా పార్టీ అంటే సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన బాధ్యత గల పార్టీ అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ప్రజలు పార్టీ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారని, అలాంటి వారికి న్యాయం జరిగేలా నేతలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, అనవసర వివాదాలు సృష్టిస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన మరోసారి హెచ్చరించారు. నేతలందరూ సమష్టిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ మరో 3 నెలలు పొడిగింపు



రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటి కాల పరిమితిని మరో మూడు నెలలపాటు జూన్ 1, 2025 నుంచి ఆగస్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టడం... ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు.

# కోర్టులో నందిగం సురేశ్ పిటిషన్..

## ఫ్యాన్ లేదు.. లాకప్‌లో దోమలు కుడుతున్నాయి



తుళ్లూరు పీఎస్ లాకప్‌లో ఫ్యాన్ లేకపోవడంతో దోమలు కుడుతున్నాయని మంగళగిరి కోర్టులో నందిగం సురేశ్ తరఫున న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. లాకప్‌లో ఫ్యాను, దోమల మందు వినియోగించుకునేందుకు అనుమతించాలని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం మంగళగిరి కోర్టులో వాదనలు జరిగాయి. తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు కోర్టుకు హాజరయ్యారు. లాకప్ రూమ్‌లోకి ఫ్యాన్, పొగవచ్చే దోమల మందులు, విద్యుత్ దీపాలను వినియోగించడానికి నిబంధనలు అనుమతించవని న్యాయస్థానానికి వివరించారు. లాకప్ బయట నుంచి గాలి వచ్చేలా టేబుల్ ఫ్యాన్, దోమల చక్రాలు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిందితుడి తరఫు న్యాయవాది కోరగా జడ్జి అనుమతించారు. వాటిని లాకప్ బయట ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక, ఉద్దండరాయునిపాలెంలోని బొడ్డురాయి సెంటర్‌కు ఈ నెల 17న తాను వెళ్లానని, ఘటన సమయంలో అక్కడే ఉన్నానని, ఇసుకపల్లి కృష్ణపై దాడిచేయలేదని పోలీసుల విచారణలో నందిగం సురేశ్ తెలిపారు. తాను కొన్న స్థలం చూసుకోవడానికే అక్కడికి వెళ్లానని చెప్పారు. అప్పుడే కృష్ణ తిడుతుంటే తన సోదరుడు ఎందుకు తిడున్నావని అడిగారని పోలీసులతో అన్నారు. అయితే, కృష్ణను ఎందుకు ఇంటికి తీసుకెళ్లారని ప్రశ్నించగా- - - సారీ చెప్పడానికి అతడే తమ ఇంటికి వచ్చాడని నందిగం సురేశ్ అన్నారు. కాగా, ఉద్దండరాయునిపాలెం టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి కృష్ణపై దాడి కేసులో తుళ్లూరు పోలీసులు గురువారం రెండోరోజు సురేశ్‌ను విచారించారు.

# తెలంగాణవాదులను కలవడం నేరం కాదన్న ఈటల రాజేందర్



తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌కు రాసిన లేఖ చర్చనీయాంశంగా మారింది. ఈరోజు కూడా కవిత సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత వ్యవహారంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం స్పందించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదని, కానీ నాయకులు, కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం కచ్చితంగా నేరమని ఆయన అన్నారు. ఈ పనులన్నీ కేసీఆర్ నేర్పించినవి కావా? అని ఈటల ప్రశ్నించారు. "బీజేపీ స్టేట్ ఫైట్ చేస్తుంది తప్ప, స్ట్రీట్ ఫైట్ చేయదు. నీచ రాజకీయాలు మేము చేయబోము" అని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారని, ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి భంగపడ్డారని విమర్శించారు. నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్ అయితే, దాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతానని, అది తన సంస్కారమని ఈటల పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ విచారణకు ఒక ఎంపీగా, మాజీ ఆర్థిక మంత్రిగా తాను తప్పకుండా హాజరవుతానని ఆయన స్పష్టం చేశారు.



# గద్దర్ అవార్డుల ప్రకటన..

## 2014- 2023 వరకు ఉత్తమ సినిమాలు

మోహన్, జ్యూరీ ఛైర్మెన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ అవార్డులను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. నిన్న 2024 ఏడాదిగానూ గద్దర్ అవార్డులను అనౌన్స్ చేశారు. ఇక రోజు ప్రముఖ సినీనటులు మురళీమోహన్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించారు. ఒక్కో ఏడాది చొప్పున ఉత్తమ చిత్రాలకు అవార్డ్స్ అనౌన్స్ చేశారు. 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి సంవత్సరానికి ఉత్తమ చిత్రంగా మూడు సినిమాలకు గద్దర్ అవార్డ్స్ ప్రకటించారు.2014 జూన్ 2 నుంచి 2023 వరకూ సెన్సార్ అయిన సినిమాల ఎంపిక

2014
బెస్ట్ ఫిల్మ్ రన్ రాజా రన్
సెకండ్ బెస్ట్ పాఠశాల
థర్డ్ బెస్ట్ ఫిల్మ్ అల్లుడు శ్రీను

2015
ఫస్ట్ బెస్ట్ ఫిల్మ్ రుద్రమ దేవి
కంచె సెకండ్
మూడో బెస్ట్ శ్రీమంతుడు

2016
శతమానం భవతి
సెకండ్ పెళ్లి చూపులు
థర్డ్ జనతా గ్యారేజ్

2017
ఫస్ట్ ఫిల్మ్ బాహుబలి కంక్యూజన్
ఫిదా సెకండ్
థర్డ్ ఘాజీ

2018
ఫస్ట్ బెస్ట్ మహానటి
సెకండ్ రంగస్థలం
థర్డ్ కేరాఫ్ కంచర్ల పాలెం

2019
ఫస్ట్ బెస్ట్ మహర్షి
సెకండ్ బెస్ట్ జర్సీ
థర్డ్ మల్లేశం

2020
అలా వైకుఠపురంలో
సెకండ్ బెస్ట్ కలర్ ఫోటో
థర్డ్ మిడిల్ క్లాస్ మెలోడీస్

2021
ఆర్ ఆర్ ఆర్
సెకండ్ అఖండ
థర్డ్ ఉప్పెన

2022
ఫస్ట్ బెస్ట్ సీతా రామం
సెకండ్ కార్తికేయ 2
థర్డ్ మేజర్

2023
ఫస్ట్ బెస్ట్ బలగం
సెకండ్ బెస్ట్ హనుమాన్
థర్డ్ భగవంత్ కేసరి

స్పెషల్ జ్యూరీ అవార్డస్
స్పెషల్ అవార్డ్స్ 6
ఎన్టీఆర్ నేషనల్ అవార్డ్ బాలకృష్ణ
పైడి జైడిరాజ్ అవార్డ్ మణిరత్నం
బిఎన్ రెడ్డి అవార్డ్ సుకుమార్
నాగిరెడ్డి చక్రపాణి చందర్ రావు
కాంతారావు అవార్డ్ విజయ్ దేవర కొండ
రఘుపతి వెంకయ్య అవార్డ్ ఫిల్మ్ యండమూరి వీరేద్ర నాథ్

# హాట్ లుక్‌లో కేతిక శర్మ..

రొమాంటిక్ సినిమాతో టాలీవుడ్‌కి హీరోయిన్‌గా పరిచయమైంది కేతిక శర్మ. మొదటి సినిమాతో కుర్రాళ్ల హృదయాల్ని అయితే కొల్లగొట్టింది. ముఖ్యంగా అందాల ఆరబోతలో కేతిక ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో యూత్‌లో క్రేజ్ అయితే బాగా వచ్చింది. కానీ సక్సెస్ మాత్రం లేటైంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సక్సెస్ ఎట్టకేలకి కేతిక శర్మకి దక్కింది. ఇటీవల రిలీజైన #సింగిల్ చిత్రంతో కెరీర్‌లో తొలి సక్సెస్ కొట్టింది ఈ బ్యూటీ. దీంతో సోషల్ మీడియాలో చీరలో వయ్యారాలు పోతూ కత్తి లాంటి ఫొటోలు షేర్ చేసింది. ఈ ఫొటోల్లో కేతిక అందాలకి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

